


అన్నగారికి ఉద్యోగం పోయిందని తెలిసిన దగ్గర నుండి చెల్లెలు నిర్మల మొహం చాటేయడం మొదలు పెట్టింది. అంతకుముందు అన్నయ్యా, వదినా అంటూ ఏలూరు నుంచి విజయవాడకు వారానికి ఒకసారైనా వచ్చి అన్నా,

వదినల దగ్గరవుండి, కావలసినవి చేయించుకుని తిని, ఇంకా తనకు కావలసిన సామాన్లు పట్టుకుపోయేది. నిర్మల, రమా వదినా మరదళ్లలా కాక సొంత అక్కాచెల్లెళ్లలా ఉంటారు. తల్లీదండ్రీలేని నిర్మలకు అన్నగారే తల్లీతండ్రీ అయి పెంచి, తన స్నేహితుడికిచ్చి పెళ్లిచేసాడు.

# అనుబంధం

చెల్లెలు కడుపు నిండా తింటే తన కడుపు నిండిపోయినట్లుండేది మధుకు. అలాంటి చెల్లెలు తనకు ఉద్యోగం టెంపరరీగానే అయినా పోయిందని తెలియగానే రాకపోకలు తగ్గించేసింది. తగ్గించేయడమేమిటి? పూర్తిగా మానేసింది. తనకు సహాయం చేయాల్సి వస్తుందనా? చెల్లెలు ఆపదలో ఆదుకోకూడదా? ఆడపిల్ల అయినంత మాత్రాన ఎంతసేపూ మా యింటికొస్తే ఏం తెస్తారు. మీ యింటికి వస్తే ఏం పెడతారు? అనే ఆలోచించాలా? కుటుంబంలోని కష్టసుఖాలు ఒక్క మగాడికేనా, ఆడపిల్ల ఎంతసేపూ ఆస్తి దక్కించుకోవడమేనా? ప్రపంచంలో పూర్తిగా మగవాళ్లుగానీ, పూర్తిగా ఆడవాళ్లుగానీ ఉంటే బావుండేమో. అసలు గొడవలన్నీ పెళ్లి చేసుకున్న దంపతుల మధ్యగానీ, అన్నాచెల్లెళ్ల మధ్యగానీ, తల్లీకొడుకుల మధ్యగానీ యిలాగే వస్తున్నాయి కదా! బెల్లంచుట్టూ చీమలులాగా డబ్బు దగ్గరే అన్నాచెల్లెళ్ల బంధుత్వమా? అబ్బా! ఈ ఆడవాళ్ల మనస్తత్వంతో ఎంత తలనొప్పో. ఎప్పుడు ఎలా ఉంటారో చెప్పలేం. ఛ...ఛ... నేను యిలా ఆలోచిస్తున్నానేమిటి? చేతిలో డబ్బుల్లేక మతిస్థిమితం తప్పుతోందా? నాకు ఉద్యోగం పోయిందన్న బాధకంటే నిర్మల చేసిన పనే జీర్ణించుకోలేకపోతున్నాను అనుకున్నాడు. రమ ఆలోచనలు కూడా యించుమించు అలాగే ఉన్నాయి. నిర్మలను ఎంత ప్రేమగా చూసాను? అయినా సరే ఎలా మారిపోయిందో... చెరువులో నీళ్లులేకపోతే చేపలుండవు కదా! ఇప్పుడు మాకు నెలనెలా జీతం లేదు. అందుకే నిర్మల రావడం మానేసింది.

ఇంతలో నిర్మల రాసిన ఉత్తరం పోస్ట్‌లో వచ్చింది.

"అన్నయ్యా! ఇన్నాళ్లూ నీదగ్గరకు రావడం లేదని బాధపడుతున్నావు కదూ! నీకు త్వరలోనే ఉద్యోగం తిరిగి వస్తుందని మీ బావగారు చెప్పారు. చాలా సంతోషం అనిపించింది. మా అన్నయ్య ఏమాత్రం బాధపడినా సహించలేను నేను. నీకు ఉద్యోగం వచ్చిన తర్వాత తప్పక వస్తాను. ఈలోపుగా నాగురించి నీవు ఏమి అనుకుంటున్నావో అని భయంగా ఉంది. అన్నయ్యా! ఇన్ని రోజులూ నేను నీ దగ్గరకు రాకపోవడానికి కారణం ఉంది. నీవు నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు.

ఎప్పటిలాగే నేనూ మీ బావగారూ వారం వారం వస్తుంటే మమ్మల్ని ఇదివరకటిలా ఆదరించలేక నీవు బాధపడతావు. మాకు ఏలోటూ చేయలేని మనస్తత్వం వదినది. మేం వచ్చి మీకు యింకా ఖర్చులు పెంచాలి. ఆ ఖర్చులు నీ కష్ట కాలంలో నీకు తగ్గించాలనే మేము రావడం మానేసాము. నీకు ఉద్యోగం రానివ్వు... ఆఘమేఘాల మీద వచ్చేస్తాం. మిమ్మల్ని ఎప్పుడెప్పుడు చూస్తానా, వదిన చేతి వంట ఎప్పుడెప్పుడు తింటానా అనీ మనసు ఆరాటంగా ఉంది. వదినను అడిగానని చెప్పు. ప్రేమతో నీ చెల్లెలు నిర్మల".

చెల్లెలి ఉత్తరం చదివిన ఆ అన్నయ్య అనుమానం పటాపంచలైపోయింది. ●

**వై.కె. మూర్తి**